అతడు మరేమీ ఆలోచించకుండా లోయలోకి దిగడం ప్రారంభించాడు. ప్రవల్లిక ఇదంతా చూస్తూనే వుంది. తమ స్థితి తల్చుకుంటూంటే ఆమెకు నవ్వూ సిగ్గూ ఒకేసారి కలుగుతున్నాయి. చెట్లకొమ్మలు పట్టుకుని అతడు దిగడం చూస్తుంటే రాంబో గుర్తుకొచ్చాడు. తన కోసమే అతడీ రిస్కు తీసుకున్నాడని ఆమెకు తెలుసు.

శవం వరకూ వెళ్ళనవసరం లేకుండానే. అదృష్టవశాత్తు చెట్ల కొమ్మలో తమ బట్టలు కనబడ్డాయి విహారికి ఆమె బ్రా దొరకలేదు మిగతావన్నీ తీసుకుని పైకి వచ్చాడు. పొదకి ఇవతలగా పెట్టి ఆ విషయం చెప్పి చెట్టుచాటుకి వెళ్ళి అయిదు నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు. అప్పటికే ఆమె తయారై వుంది.

కొంచెం సేపు ఇద్దరూ ఒకర్నొకరు చూసుకోవటానికి సిగ్గుపడ్డారు. విహారికయితే ఆమెను వివాహం చేసుకోబోయే కల్నల్‌కు ఈ విషయం తెలిస్తే ఎలా వుంటుందా అన్న అనుమానం వచ్చింది. అరక్షణం పాటు తన కళ్ళ ముందు అందంగా కదలాడిన మెరుపుతీగె వంపుని సంస్కారయుతంగా ఆలోచన్ల నుంచి తొలగించడానికి అతడు చాలా కష్టపడవలసి వచ్చింది.

ఇద్దరూ వాహనం దగ్గరకు వచ్చారు. టెర్రరిస్టులు తమను తీసుకొచ్చిన వాహనం అది. అందులోనే తాళాలు వున్నాయి. అతడు దాన్ని స్టార్ట్ చేస్తూ అన్నాడు వాడిని చంపినందుకు నా మీద కేసు వుంటుందా?

ఆమెకు నవ్వొచ్చింది ఉండదు అంది రేప్ కాబడడం నుంచి ఒక స్త్రీని రక్షించే సమయంలో చేసే చర్యకు కేసు వుండదు.

థాంక్స్.

ఆ విషయం నేను చెప్పాలి.

వాహనం కదిలింది. ఆమెకు కళ్ళజోడు సంగతి అప్పుడు గుర్తొచ్చింది. బుష్ షర్టుజేబులో వెతుక్కుంది. అది వెయ్యి ముక్కలై కనిపించింది. ఆమె దాన్ని ఖాళీచేసే ప్రయత్నంలో నిమగ్న మైంది

మీరు కళ్ళజోడులో బావుంటారు

ఆమె తన పని ఆపుచేసి అతడివేపు చిత్రంగా చూసి నవ్వేసింది. మీరొక్కరన్నారు అలా నాకేమో ఈకళ్ల జోడంటే ఎలర్జీ ఇది పగిలింది. ఓ పదిరోజులు ఇది లేకుండా తిరగొచ్చు కదా అని సంతోషిస్తున్నాను.

ఎవరన్నారు ఆడవాళ్ళకి కళ్ళజోడు బావుండదని? కళ్ళజోడు తెలివి తేటలకు చిహ్నం. నిజానికి ఈ కళ్ళజోడు మీకు బోలెడంత హుందాతనాన్నిచ్చింది.

ఆమె సీటు వెనక్కి జారి కళ్ళు మూసుకుంది. అలసి పోవడం వల్లనో అతడి మాటలకో తెలీదు.

మరుసటిరోజు పేపర్లో పిల్లల్ని సి.బి.ఐ అపాయం నుంచి తప్పించిన వైనం పెద్ద అక్షరాల్తో పడింది. ప్రవల్లిక గురించి విపులంగా వ్రాశారు. విహారి గురించి చిన్న ఐటమ్ తప్ప ఎక్కువ

వివరాలు లేవు.

మొత్తం వివరాలన్నీ బామ్మకు చదివి వినిపించింది సునాదమాల. ఒకటి రెండుసార్లు బామ్మ చదివి వినిపించుకుంది. ఆ సాయంత్రమే ఆవిడ విహారి ఇంటికి వెళ్ళింది సునాదని రమ్మంటే రాలేదు ఎందుకు? అని అడిగింది.

అదేమిటి? అసలు నీకు కృతజ్ఞత అనేది వుందా? ఆ అబ్బాయి మీ ఇద్దర్నీ వదిలి పెట్టించడం కోసం ఆ మాదర్చోత్(ఆవిడ పరిభాషలో టెర్రరిస్టు)లతో పాటు వెళ్ళాడు. ఆ అబ్బాయిగానీ అడ్డు పడకపోయి వుంటే మన విష్ణు ఏమయ్యేవాడో ఒకసారి ఊహించు.

అది తలుచుకుంటేనే సునాదమాల చేతులు వణికాయి. విష్ణూ అంటే ఆ అమ్మాయికి అంత అభిమానం. పైకి మాత్రం ఏమయ్యేది ముఖ్యమంత్రి మారిపోగానే మమ్మల్ని వదిలేసేవారు అంతేగా? అంది తేలిగ్గా.

బామ్మ ఆమె దగ్గరకు వచ్చి మొహంలో మొహం పెట్టి చూస్తూ ఏమే ఇదంతా నీకు పిచ్చా? లేక భయమా? ప్రతీదానికి యేదో ఒక వాదన కల్పించుకుంటావేమిటే లాభం లేదు నిన్ను సైక్రియాట్రిస్టుకు చూపించాల్సిందే అని గొణుక్కుంటూ తనొక్కతే విహారి ఇంటికి బయల్దేరి వెళ్ళింది.

రెండు నిమిషాల్లో బామ్మ వర్ధనమ్మ స్నేహితురాళ్ళై పోయారు. రామదాసు చరిత్ర నుంచి రామభక్త హనుమాన్ సినిమా వరకూ మాట్లాడేసుకున్నారు. వర్ధనమ్మ కాళ్ళకు పట్టీలు చూసి ఏమిటి అని అడిగింది బామ్మ.

బాబు క్షేమంగా తిరిగొస్తే విష్ణుగుడి కొండమీదకు కాలి నడకన వస్తానని మొక్కుకున్న అంది వర్ధనమ్మ.

మా అమ్మకి నేనంటే గుడ్డిప్రేమ అన్నాడు విహారి కల్పించుకుంటూ. లేకపోతే ఏమిటి చెప్పండి ఆ గరుత్మంతుడే నన్ను రక్షించాడంటుంది.

పోన్లే నాయనా ఎవరి నమ్మకాలు వాళ్ళవి. మీరు నాటకం మొదలెట్టబోయే ముందు వాతాపి పాడినట్లే అనుకోరాదూ అంది బామ్మ మాట దెబ్బ తగిలినట్లు అనిపించింది విహారికి. ఈ ముసలావిడ్ని చాలా అండర్ ఎస్టిమేషన్ చేశాను అనుకున్నాడు.

మీ మనవరాలు ఎలా వుందండీ? బావుందా? అనడిగాడు.

ఏం బాగు నాయనా దానికి బయటకు రావాలంటేనే చచ్చేటంత భయం. ఎవరితో మాట్లాడాలన్నా సవాలక్ష అనుమానాలు కోటి సందేహాలు దాంతో ఎలా వేగలో మామూలు మనుషుల్లో ఎలా పడెయ్యాలో తెలియటం లేదు.

విహారి లోపలికి వెళ్ళి అయిదు నిమిషాలలో ఒక ప్యాకెట్‌తో వచ్చి ఇది నా కాంప్లిమెంట్‌గా మీ మనవరాలికి ఇవ్వండి. మారుతుందేమో చూద్దాం అన్నాడు.

ఏమిటి నాయనా ఇది తీసుకుంటూ అంది బామ్మ.

కొడుకు వేషాలన్నీ చూస్తున్న వర్ధనమ్మ బామ్మ వెళ్ళిపోయాక అడిగింది ఏరా? ఆ అమ్మాయిని ఈపాటికి చాలాసార్లు కలిసినట్లున్నావే. ఏమిటి విశేషం అని. ఆమెకు కొడుకు తొందరగా ఓ ఇంటి వాడవుతే చాలు. ఏ అమ్మాయి అయినా ఫర్వాలేదు. అందులోనూ ఈ మధ్య అస్తి వ్యవహారాలన్నీ స్వయంగా చూసుకుంటున్నాడు.

విహారి తల్లి మనసు గ్రహించినట్లు తేలిగ్గా నవ్వేశాడు. ఆ అమ్మాయి పోపు పెట్టని ముద్దపప్పు అమ్మా అందం తప్ప ఇంకేమీ లేదు. అత్తగారితో మాట్లడానికి కూడా అయిదు పరదాలు అడ్డుపెట్టుకుంటుంది అని అక్కణ్నుంచి వెళ్ళిపోయాడు

*                *                *

నీకు అసలు బుద్ది లేదే కోప్పడింది సునాదమాల బామ్మను. ఏవరేది ఇచ్చినా తీసేసుకోవడమే.

ఎవరో ఏమిటే ఆ అబ్బాయిని చూస్తూంటే ఎంత ముచ్చటేస్తూంది అంది బామ్మ.

వయసులో ఉంటే మీరే ప్రేమలో పడతాననెట్లున్నారే బామ్మగారూ చురక అంటించింది పక్కనున్న స్నేహితురాలు.

బామ్మ తక్కువ తినలేదు.

మీ వయసులో ఉన్నవారు మాలా ఆలోచిస్తూంటే మేం మీలా ఆలోచించక తప్పుతుందా అమ్మా అంది.

అవిడ లోపలికి వెళ్ళాక ఇంతకీ ఎవడే ఆ హీరో? పేరేమిటి? అని అడిగింది స్నేహితురాలు.

విహారి అంది ..... నాటకం రోజు తరువాత మరొకసారి చూశాను అంతే'

ఏమన్నాడు? ఈ థాంక్స్ ప్రేమలోకి దిగితే అంతకన్నా అదృష్టవంతుడు ఇంకెవరూ వుండరన్నాడా?

ఉరుకోవే జరిగింది తల్చుకుంటె నాకు వళ్లంతా కంపరగా వుంది.

నేనయితే అలాంటి వాడెవడయినా నా కోసం అంత రిస్కు తీసుకుంటే వెంటనే ప్రేమించేస్తాను.

నాకిటువంటి ప్రేమలమీద నమ్మకం లేదు.

ప్రేమలో పడకముందు ఎవరయినా ఇలాగే అంటారు. ఒకసారి పడిచూడు తెలుస్తుంది.

నాకు మొగవాళ్ళంటె భయం. అంతేకాదు అసహ్యం కూడా. మా అక్కా మా అమ్మా అందరూ మొగవాడి వల్లే నాశనం అయ్యాడు. నాకు ప్రేమ సంగతి చెప్పకు మొహం చిట్లిస్తూ అంది సునాదమాల.

పోనీ ఒక పని చెయ్యి ఆ కుర్రాడెలాంటివాడో పరీక్ష పెట్టు. నీ కోసం ఎంత కష్టపడగలడో చూడు. అతడి ప్రేమ నిజమయితే నువ్వూ ప్రేమించెయ్!!

వచ్చినా పోస్టుమాన్ కుర్రాడయితే కాళ్ళు వణుకుతాయి.

ఎదురుపడి మాట్లాడకు.

ఎదుట పడకుండా ఎలా మాట్లాడటం?

పోస్టుద్వారా.

బాబోయ్ వద్దులేవే.

ఏదో నవలల్లో హీరోయిన్ అలాగే ఏడుస్తుంది. అఫ్‌కోర్స్ అది దుఃఖాంతమనుకో పాపం అ కుర్రవాడు నీకోసం అంత కష్టపడ్డప్పుడు కాస్త కనికరించటం ఆడదానిగా నీ ధర్మం.

ఇంకా నయం. కనికరించి పడకేసి పాలగ్లాసు ఇమ్మనలేదు.

పెళ్ళయ్యాక అవన్నీ ఎలాగూ తప్పవనుకో అసలు పెళ్ళి వరకూ వస్తాడా రాడా అన్నది నిర్ణయించాలి.

వచ్చినా నాలాంటి తెలివి తక్కువదాన్ని భయస్తురాలిని చూసి పారిపోతాడు

తెలివి ధైర్యం ఉన్నాయని నిరూపించు ఫోన్లో.

అబ్బ వద్దులేవే అంది సునాదమాల తిరస్కరిస్తున్నట్టు.

మరికొంచెం సేపు వాదించి విసుగొచ్చి కమల వెళ్ళిపోయింది.

అప్పుడు పడింది సునాదమాల దృష్టి విహారి పంపిన ప్యాకెట్ మీద అయిష్టంగానే విప్పింది.

లోపల పది పన్నెండు పుస్తకాలున్నాయి. అన్నీ తెలుగు నవలలు. ఉప్పులేని పప్పుచారులాంటి అమ్మాయికి ఒక హీరోయిన్‌లానైనా మీరు తయారవ్వాలని కోరుకుంటూ విహారి అని వుంది చిన్న ఉత్తరం. ఆమెకు వివరీతమైన కోపం వచ్చింది. ఏమనుకుంటున్నాడు ఇతడు తన గురించి?

ఆమె పుస్తకాలన్నీ కట్టకట్టి అటక మీద పడేసి చేతులు సబ్బుతో కడుక్కుంది.

*            *            *

ఆ రాత్రి చాలా సేపటి వరకూ విహారికి నిద్ర పట్టలేదు.

మృత్యువు వెంట్రుక వాసిలో తప్పిపోవటం నుంచి, ప్రవల్లిక పొదచాటుకి పరుగెత్తడం వరకూ ప్రతీ సంఘటనా కళ్లముందు తిరుగుతున్నాయి.

అతడు పక్కమీద అటూ ఇటూ దొర్లుతున్నాడు.

టైమ్ పన్నెండున్నర కావొస్తుంది.

ఆ టైమ్‌లో ఫోన్ మ్రోగింది.

విహారి ఫోన్ అందుకుని హల్లో అన్నాడు.

హల్లో అట్నుంచి తియ్యటి కంఠం వినిపించింది.

ఎవరు?

మిమ్మల్ని ప్రేమించాలనుకుంటున్నాను ఒక అమ్మాయిని

విహారి ఉలిక్కిపడి వ్వాట్! అన్నాడు

అవును. ఉన్నమాట ఉన్నట్టు చెప్పటంలో తప్పేముంది?

ఎవరు. మీరు?

చెప్పానుగా! ఐ లవ్ యు. ఐవాంట్ యు టు టెల్ మి వెదర్  యు లవ్ మి.

పిచ్చాసుపత్రి నుంచా?

కాదు.

కాకపోతే ఇలా ముక్కూ మొహం తెలియని వాళ్ళకి ఫోన్ చేసి ప్రేమిస్తున్నానన్నారు.

మీ ముక్కు అంగుళంన్నర పొడవు. మొహం కోలది. ఎవరన్నాడు ఆ రెండూ తెలియవని? మీకు నేను తెలుసు. నాకు మీరు తెలుసు. అందుకే రిసీవర్‌కి అడ్డుగా కాగితం పెట్టుకుని మాట్లాడుతున్నాను. ఇప్పుడు కనుక్కోగలరా నేనెవరో?

విహారి వెంటనే సమాధానం చెప్పాలనుకున్నాడు. కానీ అప్పటి వరకూ ఆమె గురించి ఆలోచిస్తూ వుండటం వల్ల ప్రవల్లికా? అని నోరుజారి చప్పున నాలిక్కర్చుకున్నాడు.

ఆవిడెవరు?

సారీ ..... మీకూ ..... మీకూ ..... సారీ ..... మీరూ ..... సునాద ..... అతడి మాట పూర్తికాలేదు. అట్నుంచి ప్రేమ ఎందులోంచి పుడుతుంది? సారీలోంచా థాంక్స్‌లోంచా? అన్న ప్రశ్న వినిపించింది నవ్వుతో.

నాకు తెలిసిపోయింది మీరెవరో నిజం చెప్పమంటారా? మొదటి చూపులో ప్రేమ అంటే ఏమిటో మిమ్మల్ని చూసాకే తెలిసింది. యు ఆర్ సో బ్యూటిఫుల్ ఏడిపించటం మొదలుపెట్టాడు

అయితే గుర్తుపట్టారన్నమాట.

అహ శుభ్రంగా అన్నాడు.

తను పంపిన పుస్తకాల ప్రభావం అప్పుడే ఆ అమ్మాయి మీద పడిందన్న మాట కాస్త మెదడు కదుల్తోంది.

చెప్పుకోండి చూద్దాం అంది.

సునాదమాల

చూడబోతే మీరూ గోపాలకృష్ణుల్లా వున్నారే ఇప్పటికి ఇద్దరి పేర్లు చెప్పారు. ఇంతకీ మీరు వెల్లకిలా పడుకుని మాట్లడుతున్నారా బోర్లా పడుకుని మాట్లాడుతున్నారా?

కూర్చుని మాట్లాడుతున్నాను.

అమ్మాయితో మాట్లడేటప్పుడు బోర్లా పడుకుని మాట్లాడాలి. అది మొదటి పాఠం. బోర్లా పడుకోండి అన్నట్టు మీ బరువు నాకు తెలుసండోయ్.

విహారి అదిరిపడి వ్వాట్ అన్నాడు అతడి కళ్ళయందు డ్రామా స్టేజి దృశ్యం కదలాడుతూ వుండగా మీ బరువు 72 కేజీలు అని అవతల్నుంచి వినిపించింది.